క్లుప్తంగా

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

కల్హేర్(నారాయణఖేడ్): నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని సిర్గాపూర్‌లో మంగళవారం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలంలో రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. నకిలీ విత్తనాలు, మందులు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. ధరల పట్టికలు, స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ శశాంక్, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: విత్తనాలు, ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఏడీఏ నూతన్ కుమార్, నాగల్‌గిద్ద ఏవో వెంకటేశం అన్నారు. నాగల్‌గిద్ద మండల కేంద్రంలో ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు తదితర రికార్డులను పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీ ధరలకంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్కావెంజర్ల ఏర్పాటుకు దాతల చొరవ

నారాయణఖేడ్: మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో పరిశుభ్రతా పనులతో పాటు తాగునీటిని అందుబాటులో ఉంచడానికి నియమించే స్కావెంజర్లకు ఏడాది పాటు వేతనాలు ఇచ్చేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చారు. చల్లగిద్దతండా ప్రాథమిక పాఠశాల, ర్యాకల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో స్కావెంజర్లకు ఏడాది పాటు వేతనాన్ని అందిస్తామని ఎంపీపీ చాందీబాయి తనయుడు రమేష్‌చౌహాన్ హామీనిచ్చారు. అదేవిధంగా గంగాపూర్, సంజీవన్‌రావుపేట పాఠశాలల్లో స్కావెంజర్లకు ఏడాది పాటు వేతనాలు చెల్లిస్తామని ఆయా గ్రామాల ఎంపీటీసీలు అశోక్ రెడ్డి, భూపాల్ ప్రకటించారు.

కుట్టుమిషన్ కేంద్రం సందర్శన


కుట్టుమిషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ జ్యోతి

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని పెద్ద చెల్మడలో ఉన్న మహిళా శక్తి కుట్టుమిషన్ కేంద్రాన్ని డీఆర్‌డీఏ పీడీ జ్యోతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 4620 మంది విద్యార్థులకు దుస్తుల జతలను కుట్టించి సకాలంలో అందించేవిధంగా చూడాలని నిర్వాహకులకు సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఇందిరా క్రాంతి పథకం ద్వారా బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం బాగయ్య, సీసీ నాగమణి, సుధాకర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి


జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని కోరుతూ కార్పొరేటర్ పుష్ప జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అందులో భాగంగా నూతన పైప్‌లైన్‌ల పనుల కోసం రూ.3.5కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు.

పొంచి ఉన్న ముప్పు

మండల పరిధిలోని కంది తండా, మామిడిపల్లి, కలివేముల, తుంకిళ్ల తండా, చెర్లగూడెం, కంది తదితర గ్రామాల శివారుల్లో ప్రమాదకరంగా స్తంభాలు పూర్తిగా ఒకవైపు వంగి విద్యుత్ తీగలు చేతికి అందే స్థాయిలో వేలాడుతున్నాయి. దీంతో రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంగిన స్తంభాలు, తీగలను సరిచేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్తంభాలు, తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

– కంది(సంగారెడ్డి)


మామిడిపల్లి శివారులో వంగిన విద్యుత్ స్తంభాలు

సూచిక బోర్డులు లేక గందరగోళం

ఓడీఎఫ్ చౌరస్తాలో సూచిక బోర్డులు లేక వాహనదారులు గందరగోళానికి గురవుతున్నారు. బెంగుళూరు బైపాస్ రోడ్డులో ని చౌరస్తా వద్ద ఆయా ప్రాంతాలకు వెళ్లే మార్గాలను తెలియజేసే ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. బెంగుళూరు, కొడంగల్, షాద్‌నగర్, హైదరాబాద్, ఓడీఎఫ్, శంకర్‌పల్లి తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఓడీఎఫ్ చౌరస్తా సెంటర్ పాయింట్‌గా ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

– కంది(సంగారెడ్డి)


సూచిక బోర్డులు లేని ఓడీఎఫ్ చౌరస్తా

ఫిట్‌నెస్ మస్ట్

స్కూల్ బస్సులకు సర్టిఫికెట్ తప్పనిసరి

- కొన్ని వాహనాలకు పూర్తికాని పరీక్షలు
- తనిఖీల్లో పట్టుబడితే సీజ్ చేస్తామని రవాణా శాఖ హెచ్చరిక

పటాన్‌చెరు టౌన్: స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ అధికారులు దృష్టిసారించారు. నేటి నుంచి పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులను తరలించే బస్సుల సామర్థ్యం పక్కాగా ఉండేలా చూడాలని అధికారులు నిర్ణయించారు. ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కే వాహనాలపై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమయ్యారు.

పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో వివిధ స్కూళ్లకు సంబంధించిన బస్సులు 483 వరకు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. పటాన్‌చెరు రవాణా శాఖ కార్యాలయంలో ఇప్పటివరకు 388 బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఇంకా 95 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. అయితే, ఫిటెనెస్ లేకుండా పాఠశాలల బస్సులు తిరిగితే సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు.

నిబంధనలు ఇవి..

- విద్యాసంస్థల బస్సులు విధిగా పసుపు రంగులోనే ఉండాలి.
- సామర్థ్యాన్ని మించి విద్యార్థులను ఎక్కించుకోవద్దు.
- డ్రైవర్‌కు హెవీ వెహికల్ లైసెన్స్ ఉండాలి. వయసు 55 ఏళ్లలోపు ఉండాలి. అలాగే ఐదేళ్ల అనుభవం కలిగి ఉండాలి.
- మద్యం తాగి వాహనం నడపొద్దు, అలా చేస్తే లైసెన్స్ రద్దు అవుతుంది.
- పాఠశాలల బస్సు కాలపరిమితి పదిహేనేళ్లు దాటకూడదు.
- కుడి ఎడమ వైపు పాఠశాలల పేరు చిరునామా స్పష్టంగా రాయాలి.
- డ్రైవర్ లైసెన్స్‌ను పాఠశాల యజమాన్యం విధిగా ఆర్టీఏ కార్యాలయంలో అందించాలి.
- బస్సు ప్రథమ చికిత్స బాక్స్, ఫైర్‌కు సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉండాలి.
- అత్యవసర ద్వారం ఉండాలి. డ్రైవర్, అటెండర్ ఫోన్ నంబర్లు విధిగా ఉండాలి.
- నెలకు ఒకసారి డ్రైవర్‌కు బీపీ, షుగర్, కంటి పరీక్షలు విధిగా చేయించాలి.
- ప్రతి బస్సులో ఫిర్యాదుల పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలి.
- డ్రైవర్, అటెండర్‌కు యూనిఫాం ధరించాలి.


స్కూల్ బస్సును పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కాలం చెల్లిన బస్సులను తీసివేస్తే సమాచారం ఇవ్వాలి



ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించుకోవాలి. 12వ తేదీ నుంచి పాఠశాలలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఫిటెనెస్ లేకుండా రోడ్లపై తిరిగే బస్సులను సీజ్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. విద్యాసంస్థలు కాలం చెల్లిన బస్సులను తీసివేస్తే రవాణా శాఖకు సమాచారం ఇవ్వాలి.

– విజయరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

ఎరువుల దుకాణాల్లో రైతుల సందడి

- సోయాబీన్, పత్తి విత్తనాలకు డిమాండ్
- డీఏపీ ఎరువుల కొరతతో రైతులకు తప్పని ఇబ్బందులు
- సాగు లక్ష్యం 7.40లక్షల ఎకరాలు

జహీరాబాద్: వానాకాలం పంటల సాగు కోసం అవసరమైన విత్తనాల కోసం రైతులు దగ్గరలోని ఫర్టిలైజర్ దుకాణాలకు వెళ్లి కొనుగోళ్లు చేసుకుంటున్నారు. దీంతో విత్తన విక్రయ కేంద్రాల్లో రైతుల సందడి నెలకొంది. ఇప్పటికే వర్షాలు కురిసిన ప్రాంతాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తుకున్నారు. ఈ ఏడాది జిల్లాలో 7.40లక్షల ఎకరాల్లో వానాకాలం పంటలు సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖ అంచనాకు వచ్చింది. ప్రధానంగా పత్తి, వరి, కంది, మొక్కజొన్న, సోయాబీన్, మినుము, పెసర పంటలు సాగు కానున్నాయి. ఈ ఏడాది పత్తి పంట విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో 3.60లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాత స్థానంలో వరి పంట సాగు కానుంది. మొత్తం 1.41లక్షల ఎకరాల్లో వరి పంట సాగు కానుందని అధికారుల అంచనా.

అత్యధిక ఎకరాల్లో పంటల సాగు

64వేల ఎకరాల్లో సోయాబీన్, 11వేల ఎకరాల్లో మొక్కజొన్న, 4,600 ఎకరాల్లో మినుము, 7,650 ఎకరాల్లో పెసర పంట సాగు కానున్నట్లు వ్యవసాయశాఖ అంచనాకు వచ్చింది. పచ్చిరొట్ట ఎరువుల కోసం జనుము విత్తనాలను ఇప్పటికే సబ్సిడీపై రైతులకు పంపిణీ చేసింది.


ఫర్టిలైజర్ దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

అందుబాటులో లేని డీఏపీ ఎరువులు

1.25లక్షల మెట్రిక్ టన్నుల మేర ఆయా రకాల ఎరువులు అవసరం ఉంటుందని, అవసరం మేరకు నిల్వలు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది. అయినా పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో డీఏపీ ఎరువులు అందుబాటులో లేవని రైతులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని దుకాణాల్లో మాత్రం డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నా ఇవ్వడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వ్యవసాయ అధికారులను అడిగితే ఎరువుల కొరత లేదని అవసరం మేరకు నిల్వలు ఉన్నట్లు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సమాధానం ఇచ్చారు.

సేంద్రియ పంటలతో లాభాలు

వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాస్

కొండాపూర్(సంగారెడ్డి): సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలతో అధిక లాభాలు పొందవచ్చని వరంగల్ శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. కొండాపూర్‌లోని రైతువేదికలో రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం ద్వారా అత్యధిక సంఖ్యలో కాయలు, గూడలు వచ్చి పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ పంట వితనం దగ్గర నుంచి కోత వరకు వివిధ దశల్లో చేపట్టవలసిన సాంకేతిక అంశాల గురించి వివరించారు. అనంతరం ఎలక్ట్రానిక్ వింగ్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన వివిధ వీడియోలను యూట్యూబ్ ద్వారా అధిక సాంద్రత పద్ధతిలో పంట వేసే పద్ధతి, వేసినటువంటి రైతుల అనుభవాలను వీడియో రూపంలో ప్రదర్శించారు. ఈ కాన్ఫరెన్స్‌లో భాగంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా ఎప్పటికప్పుడు రైతులకు వ్యవసాయ విజ్ఞానం పెంపొందించేందుకు రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులను సరిపడా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికాసోని, వ్యవసాయ సహాయ సంచాలకులు మనోహర, వ్యవసాయశాఖ మండల అధికారులు గణేష్, ప్రతిభ, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

విద్యుత్ అంశంపై ప్రస్తావిస్తా


విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

- రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవు
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి హెచ్చరిక
- విద్యుత్ అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

నారాయణఖేడ్: విద్యుత్‌శాఖలో కొందరి అధికారుల తీరుతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, దీంతో తీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి హెచ్చరించారు. నారాయణఖేడ్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ చాందీబాయి చౌహాన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు విద్యుత్‌శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరును సభ దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం తొమ్మిదేళ్ల కిందట డీడీలు చెల్లించినా కొందరు రైతులకు ఇప్పటికీ విద్యుత్ స్తంబాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి కనెక్షన్లు ఇవ్వలేదని వాపోయారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల ఈ విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. విద్యుత్ కాంట్రాక్టర్లు ఇష్టారీతిన వ్యవహరించడం సరికాదన్నారు. సరిపడా విద్యుత్ ఉన్నా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు లేకపోవడంతో సరఫరాలో తరచూ అవాంతరాలు ఏర్పడుతూ ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. విద్యుత్ అంశంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్రాస్ వెరిఫికేషన్ చేయిస్తామన్నారు. పలు తండా పాఠశాలల నుంచి ఇతర పాఠశాలలకు ఉపాధ్యాయులను ఇష్టానుసారం డిప్యూటేషన్లు వేయడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని జెడ్పీటీసీ లక్ష్మీబాయి సభ దృష్టికి తీసుకువచ్చారు. సంజీవన్‌రావుపేట్ గ్రామంలో తాగునీటి ట్యాంకును శుభ్రం చేయడం లేదని అధికారులకు గ్రూప్‌లో పాత ఫోటోలు అప్‌లోడ్ చేస్తున్నారని ఎంపీటీసీ భూపాల్ ఆరోపించారు. అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. సమావేశంలో తహసీల్దారు భాస్కర్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. వచ్చేనెలలో ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తుండడంతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సభ్యులను ఘనంగా సన్మానించారు.


నాగదేవత ఆలయాన్ని దర్శించుకున్న జడ్జి అనూష

నాగదేవత ఆలయంలో పూజలు

జహీరాబాద్: పట్టణంలో 1008 నాగదేవత విగ్రహాలతో ప్రతిష్ఠించిన ఆలయాన్ని జహీరాబాద్ జూనియర్ సివిల్ జడ్జి అనూష మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నాగదేవత విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వరస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థలం పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని సండే మార్కెట్ ప్రాంగణంలో సులబ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు కార్పొరేటర్ పుష్ప, ఉప కమిషనర్ సురేష్ మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సండే మార్కెట్ ప్రాంగణంలో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రతి ఆదివారం సంత నిర్వహించే చిరు వ్యాపారులు, రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి సులబ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు.

జహీరాబాద్‌ను అభివృద్ధి చేయండి

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గం అభివృద్ధిపై కేంద్ర మంత్రులు దృష్టి సారించాలని బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ నౌబాద్ జగన్నాథ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోడీ మంత్రి వర్గంలో తెలంగాణ రాష్ట్రం నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌లకు చోటు దక్కడం హర్షనీయమన్నారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రగతిలో కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ మంగతాయారు, ఏఈ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్మిషన్ ఫీజు తీసుకోవద్దు

పటాన్‌చెరు టౌన్: ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్ ఫీజు తీసుకోవద్దని, అడ్మిషన్ చెల్లించాలని డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఎంఈఓ పీపీ రాథోడ్ అన్నారు. ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతిలేని ప్రైవేట్ పాఠశాలల్లో తల్లిదండ్రులు అడ్మిషన్ తీసుకోవద్దని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల్లో యూనిఫాం, పుస్తకాలు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి పాఠశాలలపై నివేదిక తయారు చేసి డీఈఓకు అందజేస్తామని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయండి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామికవాడల్లో ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఖాజీపల్లి పారిశ్రామికవాడలో సీఐటీయూ క్లస్టర్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామిక వాడల్లో నెలకొన్న సమస్యలపై కార్మిక సంఘం నాయకులు, కార్మికులతో చర్చించారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ పారిశ్రామికవాడల్లో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు నివారణ చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఈఎస్ఐ ఆస్పత్రిని బొల్లారంలో నిర్మించాలని తెలిపారు. కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

◆ ట్రాఫిక్ సిగ్నల్స్‌కు మరమ్మతులు చేపట్టాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీ నుంచి తెల్లాపూర్‌కు వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ కౌన్సిలర్‌లు కొల్లూరి భరత్, పావని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు, స్కూల్ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. అండర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ కొంతకాలంగా పనిచేయకపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

◆ బెస్ట్ అవైలబుల్ పాఠశాలల ఎంపిక

సంగారెడ్డి టౌన్: సోషల్ వెల్ఫేర్ డిపార్ట్ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలలను 5వ తరగతిలో ప్రవేశానికి కలెక్టరేట్ ఆడిటోరియం కార్యాలయంలో మంగళవారం ఎంపికలు నిర్వహించినట్టు జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి అఖిలేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీటిలో ఒకటో తరగతిలో 125 మంది, 5వ తరగతిలో 128 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తామన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

◆ రెండు రోజుల్లో పనులు పూర్తి

మునిపల్లి(అందోల్): రెండు రోజుల్లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంఈఓ దశరథ్ కాంట్రాక్టర్లకు సూచించారు. మండల పరిధిలోని అంతారం, తాటిపల్లి పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పున ప్రారంభం అవుతున్న దృష్ట్యా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

◆ ద్విచక్ర వాహనం చోరీ

నారాయణఖేడ్(మెదక్): పట్టణంలో ద్విచక్రవాహనం చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మనూరు మండల పరిధిలోని శెల్గిరా గ్రామానికి చెందిన హన్మారెడ్డి బ్యాంకు పనిపై నారాయణఖేడ్‌కు టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వచ్చాడు. స్థానిక షెట్కార్ బంక్‌లో తన వాహనం నిలిపి బ్యాంకు పని ముగించుకుని వచ్చేసరికి వాహనం కనబడలేదు. బంకులోని సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి వాహనాన్ని తీసుకెళ్తున్నట్లు రికార్డయింది. ఈ మేరకు బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

◆ భద్రత కోసమే సేఫ్టీ స్టిక్కర్లు

ఝరాసంగం(జహీరాబాద్): ఆటోలలో ప్రయాణించే ప్రయాణికుల భద్రత కోసమే మై ఆటో సేఫ్ స్టిక్కర్లను అతికిస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఝరాసంగం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం ఆటోలకు స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు తమ ఆటోలకు తప్పనిసరిగా స్టిక్కర్లను అతికించుకోవాలని సూచించారు. స్టిక్కర్ల ద్వారా ఆటోలలో ప్రయాణించేవారికి నమ్మకం పెరుగుతుందన్నారు. ఆటో డ్రైవర్లు తమ వాహనాలకు సంబంధించిన లైసెన్స్‌లు, తదితర గుర్తింపు పత్రాలను వెంట ఉంచుకోవాలని, తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.